# చెప్పనా? తాబేళ్లా, తోడేళ్లా.

తాబేళ్ళంటే నాకు చిన్నప్పట్నుంచీ ఎంతో భయం. ఒక ముసలి రాత్రిపూట, రెణ్ణెల్లకిందట సత్యవతి కూర్మావతారంలాగ ముడుచుకొని మూలుగుతూ 'రావిచెట్టు రావిచెట్టు' అని అరిచింది. నేను భూకంపంలా వణికిపోయేను. రావిచెట్టులంటే సత్యవతికి సింహస్వప్నం. రావిచెట్టంటే నాకు తాబేళ్ళు జ్ఞాపకం వస్తాయి. ఎందుకో చెప్పనా? పోనీ, తరవాత చెప్తాను.

పువ్వులమ్మినవూళ్లో కట్టెలమ్మలేం అనుకుంటాం గానీ, నేను నా ఆత్మనే అమ్ముకున్నాను. నీకు తెలుసుగా నేనూ సత్యవతీ మద్రాసుతో ఎలా కాపురం పెట్టేమో! ఈ మద్రాసులో మనుష్యులుకాదు నివసిస్తున్నది; గెద్దలు, రాబందులు, తోడేళ్ళు—అదీ అసలైన నిర్వచనం—మద్రాసు నిండా తోడేళ్ళు. తోడేళ్ళు, తోడేళ్ళంటే నాకు అమితమైన అసహ్యం, ఎందుకో భయం. మొన్నరాత్రికాలం చీకటి మంటలతో కాలిపోతున్నట్టనిపించింది. సత్యవతికి నూటనాలుగు డిగ్రీలజ్వరం. నాకు ఆ జ్వరమంత ఆకలి. పైన చీకట్ల కుంభవర్షం. ఇద్దరం ముడుచుకుని పడుకొన్నాం. సత్యవతి కొనగొంతుకతో 'తోడేళ్ళు తోడేళ్ళు' అని అరిచింది. నేను దీపకళికలా, తుపానుతో తడిసినవాడిలా వణికిపోయేను. ఎందుకో చెప్పనా, పోనీలే రేపు చెప్తా.

వెంకట్రావు నన్ను తన కంపెనీలోంచి తగిలేశాడా, ఇక్కడా అక్కడా ఉద్యోగానికి ప్రయత్నించి చివరకి బస్సు కండక్టరుగా కుదురుకొన్నాను. నాకు సంతృప్తికరంగానే ఉండేది గానీ స్నేహితుల మొఖాలు? వెంకట్రావుకూడా ఒకసారి బస్సు ఎక్కాడు. 'ఎంగే సార్' అన్నాను. బిక్క చచ్చిపోయాడు. 'ఒక పారిస్' అన్నాడు. టిక్కట్టు చింపి ఇచ్చేను. 'కాలేజి చదువు చదివిన నువ్వు ఇంత నీచమైన ఉద్యోగానికి కుదురుకుంటా వనుకోలేదురా' అన్నాడు. 'రెండు లక్షల ఆస్తివున్న నువ్వు కారుఎక్కడం మానేసి బస్సులో ప్రయాణం చేస్తా వనుకోలేదురా' అన్నాను. 'తరవాత ఇంటికి రా' అన్నాడు. 'నువ్వే రా మాయింటికి' కన్నాను. వచ్చేడు. 'ఏమ్మిట్రా ఇంతహీనమైన ఉద్యోగానికి' అన్నాడు. 'నీదగ్గర మళ్లా ఉద్యోగానికి వస్తా ననుకున్నావా? - ఏం ఇప్పుడు నా కొచ్చిన లోటేమిటి- జీతంమానాన జీతం, నావ్యసనాలకు సరి పడంత పైన దొరుకుతుంది.' దులిపేశాను. తిట్టేను. 'మీావంశానికి అపకీర్తిరా' అన్నాడు తోడేలు. తరవాత ఏమైందో చెప్పనా? పోనీ రేపుచెప్తాను.

తాబేళ్ళంటే నాకు చిన్నప్పట్నుంచీ హడలు. ఎందుకోచెప్పనా? నిన్న సత్యవతిని బూడిదచేసి వచ్చాను. వెంకట్రావుకూడా వచ్చేడు. సానుభూతి కురిపించాడు. నేను వాణ్ణి తిట్టలేకపోయాను. 'రావిచెట్టు రావిచెట్టు' అని అన్నాను, ఈ మాటలు సత్యవతి చితిలోంచి వచ్చినట్టు అనిపించింది.

వెంకట్రావు మూర్ఛపోయినటు పాలి(?)పోయిన నిశ్శబ్దమిం చాడు. తోడేలు.

నీకు తెలుసా? పాతమాంబళంలో మాయింటి పెరట్లో రావిచెట్టూ నుయ్యీ ఉండేవి. ఆ నూతులోనే సత్యవతి పోనీలే తరవాత చెప్తాను. తాబేభ్యా తోడేభ్యా అంటే నాకు చెడ్డభయం. వాట్ని తప్పించుకొని బతకాలని ప్రయత్ని స్తున్నా. ఎలాగో చెప్పనా? పోనీ రేపు చెప్తాను.

గాని ఒక్క సంగతి నిన్నడగా లనుకొంటున్నా. ఈపక్కనున్న చెరువులో తాబేళ్ళు లేవుకద?